క్లుప్తంగా

జోరుగా కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు



కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కాలనీలో 9,327 మందికి ఇంటి పట్టాలిచ్చారు. అందులో మొదటి విడతగా 5,101 ఇళ్లు మంజూరయ్యాయి. ఇళ్ల నిర్మాణాలను థర్డ్ పార్టీ వారు చేపడుతున్నారు. ఇప్పటికి 327 ఇళ్లు ఆర్‌సీ వేయగా, 65 ఇళ్లు రూఫ్‌లెవల్‌లో ఉన్నాయి. 66 ఇళ్లు లింటల్ లెవల్‌లోనూ, 3,527 ఇళ్లు బెస్‌మట్టం లెవల్‌లోనూ, 378 ప్లింత్ బీమ్ లెవల్‌లో ఉన్నాయి. మిగిలిన 671 ఇళ్లు బీబీఎల్, పిల్లర్ కాంక్రీట్ లెవల్‌లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ రవికుమార్ థర్డ్ పార్టీ వారికి సూచించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అగసలదిన్నెలో పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని అంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగసలదిన్నె ఆంజనేయస్వామి, సుళేకేరి శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరి పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం తదితర పూజలను చేపట్టారు.

దేశానికి గర్వకారణం



ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వ్యాయమ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: హాకీ పురుషుల జట్టు బంగారు పతకం సాధించడం భారత దేశానికే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ వ్యాయమ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ నరసయ్య తెలిపారు. శనివారం హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. చైనా వేదికగా జరుగుతున్న ఏషియన్ గేమ్స్ ఫైనల్ మ్యాచ్‌లో జపాన్‌పై 5–1 తేడాతో భారత్ విజయం సాధించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు నరసన్న, విజయ్‌మోహన్, మల్లికార్జున, షాషావలి, జగన్నాథ్, మస్తాన్, హరిబాబు పాల్గొన్నారు.

పొదుపును అలవర్చుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో రాచోటి సుబ్బయ్య

ఆదోనిఅర్బన్: డబ్బులు పొదుపు చేయడం మహిళలు అలవాటు చేసుకోవాలని మహాయోగి లక్ష్మమ్మవ్వ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు రాచోటి సుబ్బయ్య సూచించారు. బ్యాంకుపై అంతస్తులో మహాయోగి లక్ష్మమ్మవ్వ ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అవ్వ బ్యాంకు ఉపాధ్యక్షులు బాదామి లక్ష్మన్నశెట్టి డైరెక్టర్లు ఆర్‌ఎంజీ రెడ్డి, సోమిశెట్టి సురేష్, శ్రీనివాసులు, సీఈఓ గట్టు మురళికుమార్, నసీరుద్దీన్‌పటేల్, మేనేజర్ జుల్ఫికర్, శ్యామ్‌లాల్‌సోనీ, జేరుబండి దానప్ప, టైలరింగ్ మాస్టర్ వెంకటలక్ష్మి, నాగమణి, నరసయ్య పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



ఉపాధ్యాయులకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓ–2 నాగేశప్ప

కోసిగి: మండలంలోని 48 పాఠశాలలకు ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్లు, మధ్యాహ్న భోజన వంట సామాగ్రి మంజూరు చేసిందని ఎంఈఓ–2 నాగేశప్ప తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల వారిగా కేటాయించిన స్పోర్ట్స్ కిట్స్ విద్యార్థులకు ఉపయోగించుకునేలా చూడాలన్నారు. మన బడి నాడు–నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన చింతకుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.నాగన్నను సన్మానించారు.

సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు వరం

ఆదోని టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రజలకు వరమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి అన్నారు. శనివారం పట్టణంలోని వెంకన్నబావి వీధిలో ఉన్న మున్సిపల్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి ప్రజలు తరలి వచ్చి గుండెజబ్బులు, రక్త పరీక్షలు, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, మున్సిపల్, అంగన్‌వాడీలు, ఐకేపీ మెప్మా ప్రాజెక్టు పరిధిలోని ఆర్పీలు, సీఓలు ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ వారి జబ్బుల వివరాలను తెలుసుకుని సంబంధిత డాక్టర్ వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించారు. జబ్బు తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని ఏరియా, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేందుకు టోకెన్‌లను పంపిణీ చేశారు.

హాన్వాల్‌లో ..

ఆదోని రూరల్: మండలంలోని హాన్వాల్ గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. స్పెషలిస్ట్ డాక్టర్ మయూరికుమార్, డాక్టర్ సింధూరి, డాక్టర్ సీలోఫర్, డాక్టర్ వై.శేఖర్ చిన్నారులు, వృద్ధులు, రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.క్రిష్ణమ్మ, సీహెచ్‌ఓ కస్తూరి, ఎంపీహెచ్‌ఓ లక్ష్మినారాయణ, ఈఓపీఆర్డీ నాగరాజు, ఎంపీటీసీ ఈరన్న, ఎంఎల్‌హెచ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పల్లెపాడులో..

కోసిగి: మండల పరిధిలోని పల్లెపాడులో శనివారం తహసీల్దార్ రుద్రగౌడ, డాక్టర్ మనోజ్ కుమార్ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ వ్యాధులతో బాధ పడుతున్న 321 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని కర్నూలుకు రెఫర్ చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నజీర్ అహ్మద్, రజిత, గైనికాలజిస్ట్ మౌనిక, గ్రామ నాయకుడు లంకా రెడ్డి పాల్గొన్నారు.

కామవరంలో..

కౌతాళం: మండల పరిధిలోని కామవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, సర్పంచ్ వసంత పరిశీలించారు. వైద్యులు ఇమ్మానుయేల్, వెంకటేశ్వరరావు, మానస, శివశంకర్‌రెడ్డి తదితరులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



ఆదోనిలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ అనిల్



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్



వైద్యం చేస్తున్న డాక్టర్. చిత్రంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ



ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న దృశ్యం

● సూగూరులో..

మంత్రాలయం: మండల పరిధిలోని సూగూరు ఎంపీయూపీ పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 386 మంది వైద్య సేవలు పొందారు. వైద్యులు మండల వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ, డాక్టర్ సరియు రెడ్డి, డాక్టర్ రవీంద్ర దీపక్, డాక్ట్ సురేష్ హాజరై బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మణిమంజరి, సర్పంచు లక్ష్మయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బీపీ చెక్ చేయించుకుంటున్న మహిళలు



బీపీ చెక్ చేసుకుంటున్న తహసీల్దార్ రుద్రగౌడ

● పెద్దకడబూరులో..

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ తాహెర్ ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు వీరేంద్రగౌడ్, సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న పాల్గొన్నారు.



పెద్దకడబూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పెండింగ్ పనులు పూర్తి చేయండి

● ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై శనివారం తన కార్యాలయంలో సబ్ కలెక్టర్.. ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారికి సంబంధించిన భూసేకరణ పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నాగలాపురం, చిన్నమరివాణం, కపటి, గణేకల్, కుప్పగల్, పెద్ద హరివాణం గ్రామాల్లో గుర్తించిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు అక్టోబర్ చివరిలోపు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలన్నారు. మండిగిరి గ్రామంలో జలజీవన్ మిషన్ తాగునీరు అందించే కార్యక్రమం టెండర్ దశను పూర్తి చేసి త్వరలో పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విధుల పట్ల అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజినీర్ ఖాదర్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్‌రావు, డిప్యూటీ ఇంజినీర్ శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న భజరంగదళ్ నాయకులు

కౌతాళం: హిందువులు ఐక్యమత్యంతో ఉంటూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, భజరంగదళ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి హనుమంతు, ఉపాధ్యక్షుడు మారుతిమోహన్‌లు అన్నారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్ల పూర్తైన సందర్భంగా హిందూ సంస్కృతిని సంప్రదాయాలను ప్రజలకు తెలియజెప్పేందుకు నిర్వహిస్తున్న శౌర్య జాగరణ యాత్ర శనివారం రాత్రి కౌతాళం చేరుకుంది. కృష్ణావధూత ఆశ్రమం నుంచి భజరంగ్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతిమోహన్ ఆధ్వర్యంలో ఈ యాత్ర గ్రామ పూర వీదుల గుండా కొనసాగింది. ముత్తైదువులు కలశాలతో ముందుకు రాగా ఘనంగా జరిగింది. హిందూవులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యాత్రను జయప్రదం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు చంద్రశేఖర్, నరేష్, భీమరెడ్డి, హనుమంతరెడ్డి, భజరంగదళ్ సోమిరెడ్డి, నర్సప్ప కురవ సంఘం నాయకులు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

దేవనకొండ: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెంచాలని సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. శనివారం స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో సెల్ఫీ దిగి వారిని ప్రోత్సహించారు. నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీసీడీఓ సునీత, హెచ్‌ఎం మధుసూదన్‌శర్మ, ఎంఈఓ–1 తిమ్మారెడ్డి, ఎంఈఓ–2 విజయనిర్మలదేవి పాల్గొన్నారు.



విద్యార్థినులతో డాక్టర్ వేణుగోపాల్

అన్నమయ్య జిల్లా యువకుడి ఆత్మహత్య

కర్నూలు : అన్నమయ్య జిల్లా పెనగలూరు మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నరసాపురం పెంచల సురేంద్ర (23) కర్నూలులోని కనిష్క ఇన్ లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పెంచల సురేంద్ర కర్నూలులోని ఆర్‌ఆర్ క్రిస్టియన్ కాలేజీలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేశాడు. సప్లిమెంటరీ బీఎస్సీ నర్సింగ్ ఎగ్జామ్ ఉన్నందున ఈనెల 5వ తేదీన కర్నూలు గాయత్రి ఎస్టేట్ వద్ద గల కనిష్క ఇన్ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. మోతాదుకు మించి మత్తు ఇంజక్షన్లు వేసుకుని తలుపులు బిగించుకుని బెడ్డుపైనే పడుకుని మృతిచెందాడు. 6వ తేదీ రాత్రి గదిలో నుంచి దుర్వాసన రావడంతో లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే లాడ్జి వద్దకు వెళ్లి రూమ్ నంబర్ 311 తలుపులు బద్దలుకొట్టి పరిశీలించగా బెడ్‌పై మృతదేహం కనిపించింది. అక్కడ దొరికిన ఆధారాల మేరకు తల్లిదండ్రులకు సమాచారమివ్వగా తమతో కూడా నాలుగు రోజులుగా మాట్లాడటం లేదని, ఎలాంటి సమాచారం లేదని వారు పోలీసుల దృష్టికి తెచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 325 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిదాయలం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు శనివారం 325 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాల్లో జరుగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 2,956 మంది గానూ 2,631 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

కల్లూరులో వ్యక్తి కిడ్నాప్... ఆపై దాడి

కర్నూలు : తన కూతురితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న కోపంతో బోయ వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసి దాడి చేసిన ఘటన కల్లూరులో కలకలం రేపింది. పందిపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ప్రస్తుతం గూడూరులో ఉంటూ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శంకర్ కూతురితో సన్నిహితంగా ఉండి ఫొటోలు దిగాడు. అయితే, ఆమెకు వివాహమైంది. బోయ వెంకటేశ్వర్లు ఆమెతో దిగిన ఫొటోలను భర్తకు వాట్సాప్ ద్వారా పంపడంతో వెంకటేశ్వర్లును ఎలాగైనా అంతమొందించాలని పందిపాడు శంకర్‌తో పాటు ఆయన కొడుకు జగదీష్, అల్లుడు, మరో ఆరుగురు కలిసి పందిపాడు మద్యం గోడౌన్ దగ్గరి నుంచి వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసి అలంపూరు దగ్గరకు తీసుకెళ్లి కొట్టి వదిలేసి వెళ్లిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు నాలుగో పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు.

పేదల ఉన్నతికి ప్రభుత్వం పెద్దపీట

● ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
● హాల్విలో చివరి రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: పేదల ఉన్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని హాల్వి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాలను వివరించి, వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. ఎంపీ ఫండ్స్ రూ.10 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని మహంతస్వామి మఠం పీఠాధిపతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. 5 ఎత్తిపోతల పథకాలకు సుమారు రూ.70 కోట్లతో ప్రారంభించామన్నారు. గ్రామానికి రూ.98 లక్షలతో జలజీవన్ మిషన్ పథకంతో ఇంటింటికి కొళాయిల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వల్లూరు ఎస్ఎస్ ట్యాంకుకు తుంగభద్ర నది నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు మోటార్ కోసం రూ.40లక్షలు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. సిమెంట్ రోడ్ల కోసం రూ.18 లక్షలకు ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ప్రదీప్‌రెడ్డి, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదచారి, నాయకులు చెన్నప్ప, బసవధనిలు, సిద్ధనగౌడ్, దాట్ల సుబ్బరాజు, ఏకాంబర రెడ్డి, వడ్డెరాము, కౌతాళం సర్పంచ్ క్రాంతి, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, వ్యవసాయాధికారి శేషాద్రి, ఎంపీడీఓ సుబ్బారాజు పాల్గొన్నారు.



హాల్విలో కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న మహంతస్వామి మఠం పీఠాధిపతి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సుళేకేరిలో డ్రైనేజీ ప్రారంభం

మండల పరిధిలోని సుళేకేరి గ్రామంలో అంబమ్మ ఆలయం వద్ద వంక మాదిరిగా ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ.10 లక్షలతో నిర్మించిన డ్రైనేజీని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్ర, నాయకులు ఆదిరెడ్డి పాల్గొన్నారు.



సుళేకేరిలో డ్రైనేజీ నిర్మాణం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మహాపాదయాత్రకు తరలి వెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో చేపడుతున్న చలో అలంపూర్–హైదరాబాద్ మాదిగల విశ్వరూప మహాపాదయాత్రకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు తరలివెళ్లారు. శనివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగన్, నాయ కులు మణికంఠ, మన్మోహన్, బలరామ్ ఆధ్వర్యంలో గిరి, నరసింహ, మహేష్, సుధాకర్, రాజు, మొగతలి విజయరాజు, వెల్డింగ్ నరసింహులు, సుభాష్, విష్ణు, అంజి తదితరులు తరలివెళ్లారు.

ఏప్రిల్ చివరి వరకు సాగునీరు ఇవ్వాలి

ఆదోని రూరల్: ఏప్రిల్ నెల ఆఖరి వరకు ఎల్లెల్సీ ద్వారా సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మిరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏటా రైతులు సాగు చేసిన పంటలకు ఏప్రిల్ ఆఖరి వరకు సాగునీరు అందేదన్నారు. ఈ సంవత్సరం రైతులు వరి, పత్తి, మిరప పంటలు సాగు చేశారని, పైరు ఏపుగా వస్తున్న తరుణంలో సాగునీరు నవంబర్ వరకే అందిస్తామని అధికారులు చెప్పడం తగదన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు.

పెద్దనేలటూర్‌లో ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

గోనెగండ్ల: ఈనెల 14 నుంచి పెద్దనేలటూర్ గ్రామంలోని హైస్కూల్‌లో జిల్లా స్థాయి ఓపెన్ క్రికెట్(టెన్నిస్ బాల్) టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మణ్, రాజు, వీరు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు నాగమునయ్య జ్ఞాపకార్థం ఎంపీయూపీ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.10 వేల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9381594307, 6303615845 సంప్రదించాలన్నారు.

కడదొడ్డిలో రీసర్వే పూర్తి

కోసిగి: మండల పరిధిలోని కడదొడ్డి గ్రామ పరిధిలో చేపట్టిన జగనన్న భూహక్కు– భూ రక్ష రీ సర్వే పూర్తయిందని తహసీల్దార్ రుద్రగౌడ తెలిపారు. శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతుల నుంచి సర్వే ప్రక్రియపై అభ్యంతరాలు తెలుసుకున్నారు.

ఈక్రాప్ బుకింగ్ తనిఖీ

కోసిగి: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసుకున్న పంట పొలాల నమోదును శనివారం తహసీల్దార్ రుద్రగౌడ తనిఖీ చేశారు. కడదొడ్డి, అగసనూరు, కందుకూరు, కామన్‌దొడ్డి గ్రామాల పరిధిలోని పంటలను ఇటీవల వ్యవసాయ సిబ్బంది నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదైన పంట, క్షేత్రస్థాయి ఉందా లేదా అని పరిశీలించారు.

వేతనాలు మంజూరు చేయండి

ఆదోని సెంట్రల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి సి.నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.జనార్దన్ కోరారు. శనివారం యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 30వ తేదీ నాటికి అన్ని రకాల పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లో హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయకపోవడం తగదన్నారు. సమావేశంలో నాయకులు వీరచంద్రయాదవ్, లోక్యానాయక్, రవి, ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సకాలంలో జీతాలు చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కరె కృష్ణ, బహుజన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ శనివారం కోరారు.

ఉరివేసుకుని రైతు ఆత్మహత్య

ఆలూరు రూరల్: అప్పుల బాధ తాళలేక రైతు జయరాముడు (55) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు.. మండలంలోని అంగసకల్ గ్రామానికి చెందిన జయరాముడుకు 6.91 ఎకరాల పొలం ఉంది. మరో పది ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పెట్టుబడుల నిమిత్తం చేసిన రూ.5.90 లక్షలు ఎలా తీర్చాలో తెలియక శనివారం తెల్లవారు జామున పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఉచ్చీరమ్మ ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.



జయరాముడు (ఫైల్)

ఐదుగురికి గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని విరుపాపురం రోడ్డులో ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలు.. గోనబావి గ్రామానికి చెందిన వాణి, శశికళ, రుక్మిణి, రంగమ్మ, విరుపాపురం గ్రామానికి చెందిన యల్లప్ప ఆదోని నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. గాయపడిని ఐదుగురిని 108 అంబులెన్స్‌లో ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గోనబావికి చెందిన వాణి, శశికళ, విరుపాపురం యల్లప్పను కర్నూలుకు రెఫర్ చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: పోలీసులు కొట్టారని కల్లుబావి వీధికి చెందిన యువకుడు సాయికుమార్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. యువకుడి సోదరుడు విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. చిన్నమార్కెట్‌లోని మార్కండేయ గుడి సమీపానికి చెందిన అమ్మాయి, తన సోదరుడు ప్రేమించుకుంటున్నారని, విషయం తెలిసి అమ్మాయి తల్లిదండ్రులు శనివారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తన తమ్ముడిని స్టేషన్‌కు పిలిపించి పోలీసులు చితకబాదారని ఆరోపించారు. దీంతో మనస్తాపానికి గురై సూపర్‌మార్కెట్ వద్ద పురుగు మందు తాగి రైలు కింద పడేందుకు యత్నించగా అటుగా వెళ్తున్న తన తమ్ముడి స్నేహితులు చూసి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారన్నారు. మెరుగైన చికిత్స కోసం డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేసినట్లు చెప్పారు. ఇదే విషయమై సీఐ నరసింహరాజును వివరణ కోరగా ఎవరూ లేని సమయంలో సాయికుమార్ అమ్మాయి ఇంట్లో దూరాడని, అమ్మాయి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు.



యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం